క్లుప్తంగా

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయానికి గురువారం కాసు విచ్చేసి, నగర పంచాయతీతో పాటుగా గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలు, నాయకులతో పలు అంశాలపై మాట్లాడారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని సూచించారు. కాసు వెంట పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభాని, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, నాయకులు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, షేక్ జాకీర్ హుస్సేన్, షేక్ ఖాదర్ బాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్ తదితరులున్నారు.

గురజాల తహసీల్దార్ నగేష్ బాధ్యతలు స్వీకరణ



గురజాల: గురజాల తహసీల్దార్‌గా కె.నగేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా గురజాలకు వచ్చారు. ఇప్పటివరకు తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన అశోక్‌కుమార్ రెడ్డి బదిలీ అయ్యారు. ఈయన గతంలో నకరికల్లు, సత్తెనపల్లి, రాజుపాలెం మండల తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించారు. గతంలో నాలుగు నెలలు పాటు గురజాల రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా విధులు నిర్వహించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు, ప్రజలకు అందుబాటులో వుండి సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానన్నారు. దళారులను ఎవరూ నమ్మవద్దని నేరుగా వచ్చి సమస్యలు తెలపాలన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారి రమణా కాంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

కారెంపూడి తహసీల్దార్‌గా ప్రసాద్



కారెంపూడి: కారెంపూడి మండల తహసీల్దార్‌గా బీవీఆర్‌సీహెచ్ ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. డీటీ కీర్తి సుధా స్రవంతి, వీఆర్ఓలు, వీఆర్ఏలు, నౌకర్లు, కార్యాలయ సిబ్బంది నూతన తహసీల్దార్‌కు సాదర స్వాగతం పలికారు. బీవీఆర్‌సీహెచ్ ప్రసాద్ గతంలో మాచవరం తహసీల్దార్‌గా పనిచేస్తూ ఎన్నికల విధుల్లో భాగంగా తిరుపతి జిల్లాకు వెళ్లారు. అనంతరం జరిగిన నియామకాలలో కారెంపూడి తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు.

రెంటచింతల తహసీల్దార్‌గా కరుణ కుమార్



రెంటచింతల: రెంటచింతల తహసీల్దార్‌గా జి. కరుణకుమార్‌ను నియమిస్తూ పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆయన దాచేపల్లి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ ఎన్నికల నియమావళి మేరకు నెల్లూరు జిల్లాకు వెళ్లారు.

దుర్గి తహసీల్దార్‌గా వేణుగోపాల్

దుర్గి: దుర్గి మండల తహసీల్దార్‌గా జి.వేణుగోపాల్ నియమితులయ్యారు. ఈమేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అమరావతి సెక్రటేరియేట్‌లో విధులు నిర్వహిస్తున్న వేణుగోపాల్ త్వరలోనే బాధ్యతలు స్వీకరిస్తారని రెవెన్యూ యంత్రాంగం తెలిపింది.

పిడుగురాళ్ల తహసీల్దార్ బాధ్యతలు స్వీకరణ



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల తహసీల్దార్‌గా జె.మధుబాబు గురువారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఆయన తహసీల్దార్‌గా నూజెండ్ల మండలంలో పని చేసిన ఎన్నికల సయమంలో ఒంగోలుకు బదిలీపై వెళ్లి నేడు పిడుగురాళ్ల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... భూ వివాదాలు లేకుండా, రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని ఆయన తెలిపారు.

దాచేపల్లి తహసీల్దార్ బాధ్యతలు స్వీకరణ



దాచేపల్లి: మండల తహసీల్దార్‌గా కేవీ కుటుంబరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ రాజు తహసీల్దార్ కుటుంబరావుకి బాధ్యతలు అప్పగించారు. కార్యాలయం సిబ్బందితో పాటుగా వీఆర్వోలు కుటుంబరావుని సన్మానించారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిలర్‌గా వెంకటేశ్వర్లు

పిడుగురాళ్ల: మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిలర్‌గా ఉడతా వెంకటేశ్వర్లు గురువారం నియమితులయ్యారు. ఉడతా వెంకటేశ్వరరావును మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలియజేశారు. వెంకటేశ్వర్లు మున్సిపల్ తరపున కేసులను పరిష్కరించటం, వాదించటం వంటివి నిర్వహిస్తారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమారస్వామి, కరణం కాశీవిశ్వనాథం, రెడ్డి సాంబశివరావు, దారా చెన్నయ్య, చంద్రశేఖర్ రావు, రామిరెడ్డి అభినందించారు



పీకేజీ మేజర్ కాల్వ నుంచి లీకవుతున్న నీరు



కాల్వ సిమెంట్ గోడపై సైతం పెరిగిన కంపచెట్లు

కాల్వలు ఇలా.. నీరు పారేదెలా..?

- అధ్వాన స్థితిలో మేజర్ కాల్వలు
- గట్లపై పిచ్చి చెట్లు, కాల్వల్లో తూటికాడ..
- ఏళ్లుగా జరగని పూడికతీత పనులు



కాల్వలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న గడ్డి, ఇతర చెట్లు

కారెంపూడి: నాగార్జున సాగర్ జలాశయం ఇప్పటికే నిండుకుండగా ఉంటుండగా, కాల్వలకు నీరు విడుదలయ్యే శుభ తరుణం ఆసన్నమవుతోంది. ఈ నెలాఖరుకు నీరు విడుదల కావచ్చని భావిస్తున్న పరిస్థితి. అయితే అది జరిగినా కాల్వ కట్టలపై కంప, పిచ్చి చెట్లు అలుముకోవడం, డ్రాపులు కూడా పాడైపోయిన పరిస్థితిలో నీరు సక్రమంగా పారే పరిస్థితులు క్షేత్రస్థాయిలో కన్పించడం లేదు. అప్పుడు చివరి ఆయకట్టు వరకు నీరందించడం కలే అవుతుంది.

సబ్ డివిజన్ పరిధిలో 8 మేజర్ కాల్వలు..

కారెంపూడి ఓఅండ్‌ఎం సబ్ డివిజన్ పరిధిలో 8 మేజర్ కాల్వలున్నాయి. మిరియాల, చర్లగుడిపాడు, రామాపురం, పెద కొదమగుండ్ల, కేసానుపల్లి, జానపాడు, గుత్తికొండ, కోటనెమలిపురి మేజర్ కాల్వలున్నాయి. ప్రతి కాల్వకు మరమ్మతులు అవసరం ఉంది. ముఖ్యంగా పూడిక తీతతో పాటు జంగిల్ క్లియరెన్స్ అత్యవసరంగా కన్పిస్తున్నాయి. ఉదాహరణకు ఉన్న మేజర్లలో బాగా ఉంటుందని భావించే పెదకొదమగుండ్ల కాల్వను పరిశీలిస్తేనే మరమ్మతుల ఆవశ్యకత అర్థమవుతుంది. కాల్వ ప్రారంభం నుంచి అక్కడక్కడా కరకట్టలు కోసుకు పోయి కన్పిస్తున్నాయి. కరకట్టలపై పిచ్చి కంప దర్శనమిస్తోంది. కాల్వ అండర్ టన్నెల్ వద్ద వాటర్ లీకేజీలు బాగా కన్పిస్తున్నాయి. అక్కడ రివిట్‌మెంట్ బాగా దెబ్బతింది. సిమెంట్ గోడలపై సైతం పెద్ద పిచ్చి చెట్లు మొలిచి కన్పిస్తున్నాయి. నీటి ప్రవాహం సక్రమంగా సాగాలన్నా కాల్వల పూడిక తీతలు అత్యవసరం. అప్పుడూ నీరు సక్రమంగా పారి కాల్వ చివరి భూముల వరకు నీరు అందుతుంది.

మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం..

డివిజన్ పరిధిలోని కాల్వలకు మరమ్మతులు అత్యవసరం. కారెంపూడి సబ్ డివిజన్ పరిధిలో ఎనిమిది మేజర్లకు రిపేర్లు చేయాలని అంచనా ప్రతిపాదనలు పంపాం. కాల్వల పూడిక తీతతో పాటు జంగిల్ క్లియరెన్స్ చేయాల్సిన అవసరం ఉంది. 8 మేజర్లకు రూ.1.60 కోట్లకు అంచనా ప్రతిపాదనలు గత జూన్ 19న పంపాం. వర్క్స్ మంజూరు కాగానే టెండర్లు పిలిచి మరమ్మతులు చేయిస్తాం.

– బి.నరేంద్ర, ఏఈ, ఓఅండ్‌ఎం సబ్ డివిజన్, కారెంపూడి

బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలే దివ్యౌషధం

- మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.కృష్ణారెడ్డి
- తల్లిపాలపై అవగాహన ర్యాలీ



ర్యాలీ ప్రారంభిస్తున్న మెడికల్ ఆఫీసర్

రెంటచింతల: బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలే శ్రీరామరక్ష అని స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణారెడ్డి అన్నారు. ఆగస్టు 1 నుంచి 8 వ తేదీ వరకు నిర్వహిస్తున్న తల్లి పాల వారోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక పీహెచ్‌సీ నుంచి ఆరోగ్య, ఆశా కార్యకర్తలతో ప్రజలలో అవగాహన కల్పించేందుకు చేపట్టిన ర్యాలీని మెడికల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. బిడ్డ పుట్టిన వెంటనే అరగంట లోపల తల్లి పాలు పట్టించడం సంపూర్ణ ఆరోగ్యానికి మార్గమన్నారు. మొదటి 6 నెలల వరకు బిడ్డకు చనుబాలే ఆహారంగా ఇవ్వాలన్నారు. శిశువుకు చనుబాల్విడం వలన వ్యాధి నిరోధక శక్తి పెరిగి అంటు వ్యాధులు, అతిసార, శ్వాసకు సంబంధించిన ప్రమాదకరమైన వ్యాధులు, మూత్ర నాళం తదితర అంటు వ్యాధుల బారినుంచి రక్షణ కలుగుతుందన్నారు. తల్లి పాలు బిడ్డల మేధస్సును మెరుగుపరచడంలో సహాయపడుతుందన్నారు. శిశువుకు చనుబాలు ఇచ్చే వారిలో రొమ్ము, గర్భాశయం, అండాశయం క్యాన్సర్ ప్రమాదం తక్కువగా ఉంటుందని, తల్లి కూడ అదనపు బరువు తగ్గడానికి సహాపడుతుందన్నారు. ఈ వారం రోజుల పాటు ప్రతి ఆరోగ్య కేంద్రంలో, అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి తల్లులకు తల్లిపాల ప్రయోజనాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఎంపీహెచ్‌ఎస్ ఏడీ శర్మ, ఎం.ఆంజనేయులు, సూపర్‌వైజర్స్ ఎస్.కోటేశ్వరరావు, హెచ్‌వీఎస్ నిర్మల, లక్ష్మీప్రసన్న, హెల్త్ అసిస్టెంట్స్ మహేష్, డి.సీతారామిరెడ్డి, ఖాసిం, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత స్థానాలకు చేరుకోగలం

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల: విద్యతోనే విద్యార్థుల భవిష్యత్ మారుతుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాలలో నూతన పాఠ్యపుస్తకాల పంపిణీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ముందుగానే నిర్ణయించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా చదువుకోవాలని సూచించారు. జూనియర్ కళాశాలో డిగ్రీ కాలేజీ కోసం కృషిచేస్తానని తెలిపారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ...విద్యతోనే ఎంతో మంది ఉన్నత లక్ష్యాలకు చేరుకున్నారని, వారిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు మరింత కష్టపడాలని సూచించారు. అనంతర విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు.

నకరికల్లు పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

నకరికల్లు: ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించడంతో పాటు వచ్చిన ఫిర్యాదుదారులకు స్పదించాలని ఎస్పి కె.శ్రీనివాసరావు ఆదేశించారు. నకరికల్లులోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఎస్ఐ కె.నాగేందర్‌రావుతో పాటు సిబ్బందితో మాట్లాడి వివరాలు సేకరించారు. పలు సూచనలు చేశారు. పల్నాడు ఎస్పిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారి రావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, పెండింగ్ కేసులు లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కారం చేసుకోవాలని, సివిల్ సంబంధిత కేసుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

పత్తి పొలాలను పరిశీలించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్



రైతు మురళి పత్తిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు డాక్టర్ శివకుమారి, ప్రవీణ్, వ్యవసాయ అధికారులు

కారెంపూడి: పత్తి సాగులో ఎర్ర బొమ్మిడి తెగులు ఉధృతిపై 'ఎర్రబొమ్మిడి తెగులుతో రైతుల దిగాలు' శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ స్పందించారు. వెంటనే సంబంధిత శాస్త్రవేత్తలను, అధికారులను పైర్లను క్షేత్ర పరిశీలన చేసి రైతులకు పరిష్కార మార్గాలు చూపాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో డీఆర్‌సీ డీడీఏ డాక్టర్ ఎం.శివకుమారి, డీఆర్‌సీ వ్యవసాయాధికారి పి.ప్రవీణ్, పిడుగురాళ్ల ఏడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు, ఏఓ బి.యలమందారెడ్డి గురువారం పత్తి పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. కారెంపూడికి చెందిన కొర్రపాటి మురళి, ఒప్పిచర్లకు చెందిన కౌలు రైతు ఎలిశెట్టి ఆంజనేయులు పత్తి పంటలను పరిశీలించారు. మార్గ మధ్యలో కూడా తెగులు సోకిన అనేక పత్తి పంటలను చూశారు. రైతులు అంకూర్ అనూష, వేద ధర్మ్ గోల్డ్ రకం విత్తనాలను వాడారని తెలిపారు. పచ్చదోమ ఆకుల రసం పీల్చడం వల్ల ఆకులు పసుపు, ఎరుపు రంగులోకి మారి ఆకులు పైకి ముడుచుకుపోయాయని పేర్కొన్నారు. దీనినే రైతులు వ్యవహారిక భాషలో ఎర్రబొమ్మిడి తెగులని పిలుస్తారన్నారు. గతంలో 18 రోజులు ఎడతెరపి లేకుండా రైతులు మందులు పిచికారీ చేసుకునే అవకాశం లేకపోవడంతో పచ్చదోమ, ఇతర రసం పీల్చు పురుగుల ఉధృతి పెరిగిందన్నారు. ఏప్రిల్‌లో పత్తి వేసిన వారు నివారణ చర్యలు తీసుకోవడం అంత లాభదాయకం కాదని, అయితే లేత పైర్లలో ఇది ఉంటే నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఫ్లూనికామిడ్ లీటరు నీటికి 0.3 గ్రాములు చొప్పున ఎకరాకు 60 గ్రాములు పిచికారీ చేయాలని లేదా డయాఫెన్‌థియాన్ లీటరు నీటికి 1.25 గ్రాములు చొప్పున ఎకరాకు 250 గ్రాములు పిచికారి చేయాలని, లేదా థయోమిథాక్సమ్ 0.3 మి.లీ లీటరు నీటికి పిచికారి చేయాలని పొటాషియం నైట్రేట్ కూడా పిచికారీ చేయాలని డాక్టర్ శివకుమారి రైతులకు సూచించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడారు. వారికి పలు సూచనలు సలహాలిచ్చారు.

సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకం



హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు



స్వీట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గురజాల: రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకమైనదని న్యాయవాదుల సంఘం మాజీ ప్రెసిడెంట్ బీఎన్‌వీ హనుమంతరావు అన్నారు. స్థానిక కోర్టులో న్యాయవాదుల ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు తీర్పుపై గురువారం హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో భాగంగా ఎ,బి,సి,డి వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగించడం శుభపరిణామమన్నారు. విద్య, ఉద్యోగాల్లో ఎస్సీలకు రిజర్వేషన్ అవసరమని సుప్రీంకోర్టు గుర్తించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కర్రా చినకోటేశ్వరరావు, కత్తి చలమరాజు, బి.సుందర జ్ఞానమ్మ, చాగంటి సురేష్, పి.సురేష్ ఉన్నారు.

దశాబ్దాల కల నెరవేరింది..

దుర్గి: ఎన్నో దశాబ్దాలుగా ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ చేస్తున్న పోరాటం ఫలించిందని ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. గురువారం సుప్రీంకోర్టులో ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించవచ్చనే తీర్పు రావటంతో ఆ వర్గాలకు చెందిన నేతలు సంబరాలు చేసుకున్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద స్వీట్లు పంపిణీ చేశారు. ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా కన్వీనర్ పేరుపోగు రామయ్య మాట్లాడుతూ వర్గీకరణకు అనుకూలంగా తీర్పురావడం హర్షణీయమన్నారు. ఏపీ ప్రభుత్వం రాబోయే రోజుల్లో మాదిగ, మాదిగ ఉప కులాలకు రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుర్గి మండల ఎమ్మార్పీఎస్ నాయకులు పులిమెల అన్నారావు, రాయపాటి ప్రసాద్, కోటా రాజు, ప్రశాంతి, మోషే, వెంకయ్య పలువురు నాయకులు పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధుల ఉచిత చికిత్స శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ డాక్టర్ బాలశంకరరావు

సత్తెనపల్లి: పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు గ్రామంలో గల గ్రామీణ పశువైద్యశాలలో గురువారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 50 గేదెలకు గర్భకోశ వ్యాధులకు సంబంధించిన రోగాలను గుర్తించి వాటికి చికిత్స చేశారు. 15 సాధారణ కేసులు, 25 దూడలకు నులిపురుగు మందులను తాపించారు. సదస్సులో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ డాక్టర్ బాలశంకరరావు మాట్లాడుతూ లింగ నిర్ధారణ, వీర్యం యొక్క ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. అనంతరం రైతులకు లవణ మిశ్రమం ప్యాకెట్ల ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ నరసరావుపేట డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి.రామారావు, సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్.నరసింహులు, సత్తెనపల్లి సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ జొన్నలగడ్డ మరి యమ్మ, పశు వైద్యులు డాక్టర్ జి చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ ఎం పుల్లారెడ్డి, డాక్టర్ జి శ్రీనివాసరావు, పారాసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కారెంపూడిలో 97 శాతం పింఛన్ల పంపిణీ



పాలువాయిగేటులో పింఛన్‌లను పంపిణీ చేస్తున్న మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి



శ్రీనగర్‌లో పింఛన్ నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి



పింఛన్ డబ్బు పంపిణీ చేస్తున్న ప్రత్యేకాధికారి జోసెఫ్ కుమార్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి

కారెంపూడి: కారెంపూడి మండలంలో గురువారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం మూడు గంటలకే 97 శాతం మందికి ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఇందులో సచివాలయ ఉద్యోగులతో పాటు అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు. మండలంలో మొత్తం 7,561 పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా మధ్యాహ్నానికే 7,298 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. మొదటి రోజునే అందరికి పింఛన్లు అందించాలన్న జిల్లా కలెక్టర్ ఆదేశాలను లక్ష్యంగా పెట్టుకుని మండల ప్రత్యేక అధికారి డ్వామా పీడీ జి.జోసెఫ్‌కుమార్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఎంపీడీఓ పింఛన్ల పంపిణీకి 129 మందిని నియమించారు. వారికి 50 డివైజ్‌లను సమాకూర్చారు. చెడిపోయిన సెల్‌లను కూడా బాగు చేయించి పింఛన్ల పంపిణీని వేగవంతంగా నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ జోసెఫ్‌కుమార్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఇతర కో–ఆర్డినేటర్లు స్వీయ పర్యవేక్షణలో తెల్లవారు జాము నుంచే పింఛన్ల పంపిణీని ప్రారంభించారని తెలుస్తోంది.

దాచేపల్లి మండలంలో...

దాచేపల్లి: పల్నాడు ప్రాంతంలోని అన్ని ప్రభుత్వ ఆస్తులకు జాతీయ నేతల పేర్లు పెడతామని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పొందుగల, రామాపురం, శ్రీనగర్ గ్రామాల్లో గురువారం ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తితో కలిసి ఆయన పింఛన్ నగదు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ... అద్దంకి–నార్కెట్‌పల్లి జాతీయ రహదారికి స్వాతంత్య్ర సమరయోధుడు, పుల్లరి ఉద్యమకారుడు కన్నెగంటి హనుమంతు పేరు, బ్రాహ్మణపల్లి వైఎస్ రాజశేఖరరెడ్డి మెడికల్ కళాశాలకు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెడతామని వెల్లడించారు. నాయకులు బెల్లంకొండ బద్రి, తంగెళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గురజాలలో..

గురజాల: సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా గ్రామాల్లో కూటమి నాయకులు సచివాలయ సిబ్బందితో కలిసి గురువారం పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఉదయం నుంచి ప్రతి ఇంటికి వెళ్లి అర్హులకు పింఛన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ కన్వీనర్ అడపా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు నేలవల్లి బుల్లయ్య, చాగంటి శ్రీనివాసరావు, కోట్టే శ్రీనివాసరావు, చింతకాయల కళ్యాణ్, జూకూరి బ్రహ్మం, కందిమళ్ల రామకృష్ణ, శరమాళ్ల హనుమంతరావు, చింతకాయల దానయ్య, సోలసా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గిలో...

దుర్గి: పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని మండలంలోని 11 సచివాలయాల పరిధిలో పెన్షన్‌దారులకు పంపిణీ చేపట్టారు. గురువారం ఉదయం 6గంటల నుంచి సచివాలయ సిబ్బంది, ఇతర ప్రభుత్వ శాఖ సిబ్బంది, అధికారుల ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. మొత్తం మండల వ్యాప్తంగా 6815 పింఛన్‌దారులకు గానూ 6573 మందికి, 96.53 శాతం పింఛన్‌లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ జీఎల్ఎన్ గుప్తా తెలిపారు. దుర్గిలో బీజేపీ మండల అధ్యక్షుడు వెలిదండి శ్రీనివాసరావు పింఛన్‌దారులకు పెన్షన్ అందజేశారు. పలు గ్రామాలలో కూటమి నేతలు పాల్గొని పింఛన్ అందజేశారు. కోలగుట్ల గ్రామంలో మండల స్పెషలాఫీసర్ సంజీవరావు పాల్గొని స్వయంగా లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీలు శివశంకర్, కృష్ణ, హౌసింగ్ ఏఈ రాణి, పలువురు సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

రెంటచింతలలో...

రెంటచింతల: మండల పరిధిలోని వివిధ గ్రామాలలో పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్‌లను అందజేయడమే తమ అభిమతమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని పాలువాయిగేటు గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్‌లను అందచేసి మాట్లాడారు. సచివాలయ సిబ్బందితోనే మధ్యాహ్నం 1 గం. కల్లా 95 శాతం పింఛన్లు పంపిణీ చేశామన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న నేషనల్ హైవే పనులను పరిశీలించారు. 273 గ్రామ సచివాయ సిబ్బందితో మొత్తం 7,073 పింఛన్‌దారులుకు గాను 6,847 మందికి 97.22 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్‌లు పంపిణీ చేసినట్లు జిల్లా భూగర్భ జల అధికారి, మండల ప్రత్యేక అధికారి టి.సత్యనారాయణ శర్మ, మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ పెదప్రోలు శంకర్‌రావు తెలిపారు.

విద్యార్థులకు ప్లేట్లు అందజేత

దాచేపల్లి: మండలంలోని రామాపురం ప్రభుత్వ పాఠశాలకు భోజనం ప్లేట్లను గురువారం అందజేశారు. జిల్లా ఆర్యవైశ్య యువజన విభాగం సంఘం ఆధ్వర్యంలో పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులంతా మధ్యాహ్న భోజనం చేసేందుకు 150 ప్లేట్లను అందించారు. జిల్లా అధ్యక్షుడు మాశెట్టి సాత్విక్, హెచ్‌ఎం చాంద్‌బాషా, నాయకులు దేవరశెట్టి చంద్రశేఖర్, దేవరశెట్టి బాలు, మువ్వల మనోజ్, ఆతుకూరి గుప్త పాల్గొన్నారు.

ఉద్దంసింగ్ ఆశయాలను కొనసాగించాలి

పిడుగురాళ్ల: ఉద్దం సింగ్ ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగిద్దామని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలోని సీపీఎం హాల్ నందు ఉద్దంసింగ్ 84 సంస్కరణ సభను నిర్వహించారు. ఈ సభకు పీడీఎం జిల్లా అధ్యక్షులు ఎస్‌కే మస్తాన్‌వలి అధ్యక్షత వహించారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక చంద్రశేఖర్ మాట్లాడుతూ 84 ఏళ్లక్రితం అమరుడైన కామ్రేడ్ ఉద్దం సింగ్ దేశ ప్రజల బానిస విముక్తి కోసం పోరాడిన మహోతన్నతమైన విప్లకారుడన్నారు. పీడీఎం రాష్ట్ర అధ్యక్షుడు కె. శ్రీనివాసరావు, ఎంసీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.అబ్రహం లింకన్, ఓర్సు కృష్ణ, గిరిజన హక్కుల సంఘం నాయకులు కోట నాయక్, శ్రీను నాయక్, ఏపీ సీఎల్‌సీ చిన్న, సీపీఎం శ్రీను, సీపీఐ గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో కార్పొరేట్ విద్యకు కృషి



విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జేబీఆర్

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద తల్లిదండ్రులకు వారి పిల్లల విద్య భారం కాకుండా ప్రభుత్వమే ఉచితంగా విద్యనందిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు బొకేలు అందజేసి పూలమాలలు, శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యేచూరి సాయి శంకర్, సొసైటీ చైర్మన్ కటకం రామారావు, ప్రిన్సిపాల్ వేణు, ఎంపీడీఓ జీఎల్ఎన్ గుప్తా, స్పెషలాఫీసర్ సంజీవరావు, పార్టీ నాయకులు సింగు నాగేశ్వరరావు, దాసు, నారయ్య, సూరె వెంకటేశ్వర్లు, అంజయ్య, మండలాధ్యక్షులు వెలిదండి శ్రీనివాసరావు, యు.చిన్న ఆంజనేయులు, సర్పంచ్ జక్కా రమేష్, జనసేన జిల్లా కార్యదర్శి వి.హరి పాల్గొన్నారు.